

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మద్దతివ్వండి

- సిపిఎంను కోరిన టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్
- జూబ్లీహిల్స్‌పై 20న జరిగే రాష్ట్ర కమిటీలో నిర్ణయం తీసుకుంటాం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలనీ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసిరావాలని సిపిఎంను టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం(ఎంబీ భవన్)లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఇతర నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఆ భేటీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, తదితరాంశాలపై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మహేశ్‌కుమార్‌గౌడ్ మద్దతు కోరగా...ఈ విషయంపై హైదరాబాద్ నగర కమిటీలో చర్చలు జరుగుతున్నాయనీ, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ హామీనిచ్చారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఆ తర్వాత అన్ని పార్టీల నాయకులతో కూడిన బృందానికి ఢిల్లీకి తీసుకెళ్లి ఈ విషయంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. అదే సమయంలో ఢిల్లీలో జాతీయ, ఇతర ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని కూడా చేయాలన్నారు. అప్పుడే కేంద్రంపై ఈ విషయంలో తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి విజయం సాధించగలుగుతామన్నారు. అఖిల పక్ష సమావేశం నిర్వహణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అన్ని పార్టీల నేత బృందాన్ని తీసుకెళ్లడం అంశాలపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ సానుకూలత వ్యక్తపరిచారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి జ్యోతి, టి సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

టి-సేఫ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌కు ఛేంజ్ మేకర్స్ ఫర్ గుడ్ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టి-సేఫ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌కు ప్రతిష్టాత్మక ఛేంజ్ మేకర్స్ ఫర్ గుడ్ అవార్డు లభించింది. అసోసియేటెడ్ అడ్వర్టైజింగ్‌కు ఏఎఫ్ఏఏ ద్వారా ఈ అవార్డు లభించింది. దీంతో బీజింగ్‌లో జరిగే ఎఎఫ్ఎఎ అవార్డుల్లో ఈ ప్రచార కార్యక్రమంతో భారత్ ప్రాతినిథ్యం వహించనుంది. ప్రచార కథనంలో ఒక మహిళ అర్ధరాత్రి ఒంటరిగా ప్రయాణిస్తూ టి-సేఫ్ నెంబర్‌ను ఉపయోగించే సందర్భం చూపించారు. ఆమె కాల్స్‌కు స్పందించకపోయినా, పోలీసులు నిరంతరంగా ఆమె భద్రతపై దృష్టి పెట్టడం హృద్యంగా చూపించారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశం ప్రజలకు టి-సేఫ్ సేవ గురించి అవగాహన కల్పించడం, మహిళలు ఈ సేవను వినియోగించుకునేలా ప్రోత్సహించడం, రాత్రి సమయంలో మహిళలకు భద్రతగా ఉండే పరిసరాలను ఏర్పరచడంలో సహకరించడమే.

జ్ఞానం, ధైర్యం, అంకితభావంతో ప్రపంచంలోకి అడుగుపెట్టాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీలో సంపాదించిన జ్ఞానం, ధైర్యం,వినయం,అంకితభావంతో ప్రపంచంలోకి అడుగుపెట్టాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రాడ్యుయేట్లను సమాజం గొప్ప అంచనాలతో చూస్తుందని, మానవాళికి సేవ చేయడానికి.. ఎంచుకున్న రంగాలలో రాణించాలని సూచించారు. గురువారం జరిగిన పాలమూరు యూనివర్సిటీ నాల్గో స్నాతకోత్సవ కారక్రమానికి గవర్నర్ అధ్యక్షత వహించారు. ముందుగా విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియం వద్ద గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయి, జిల్లా ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. ఎంఎస్ఎన్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ చైర్మెన్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. అలాగే 12 మందికి పీహెచ్‌డీ అవార్డులు, 83 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పట్టభద్రులు, బంగారు పతక విజేతలందరిని అభినందించారు. స్నాతకోత్సవం అంటే "సమావేశం" అని అర్థం అని, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్ది మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను సత్కరిస్తుందని తెలిపారు. "సమాజం మిమ్మల్ని గొప్ప అంచనాలతో చూస్తుంది.. ఎందుకంటే మీరు మానవాళికి సేవ చేయడానికి ఈ గోడలకు అతీతంగా మీరు ఎంచుకున్న రంగాలలో రాణించాలి. మీ విద్య ఇక్కడితో ముగియదు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్టు.. మనస్సును పెంపొందించుకోవడం మానవ ఉనికి యొక్క అంతిమ లక్ష్యం కావాలి.." అని చెప్పారు."మీతో ఉండటం నాకు అపారమైన ఆనందాన్ని, లోతైన గౌరవాన్ని ఇస్తుంది. ఒక విశ్వవిద్యాలయం విద్యా జీవితంలో అత్యంత పవిత్రమైన సందర్భాలలో స్నాతకోత్సవం ఒకటి. ఇది విద్యార్థుల విజయాలకు మాత్రమే కాకుండా, వారిని మార్గనిర్దేశం చేసి, పెంచి ఉపాధ్యాయులు, మార్గదర్శకులు, కుటుంబాల అవిశ్రాంత కృషికి పాల్గొన్నారు.

సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- పత్తి క్వింటాల్‌కు రూ.10 వేలు చెల్లించాలి
- తెలంగాణ పత్తి రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తిని కొనేందుకు వెంటనే సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ పత్తి రైతు సంఘం డిమాండ్ చేసింది. క్వింటాల్ పత్తికి రూ.పది వేల మద్దతు ధర కల్పించాలని కోరింది. అన్ని రకాల ఒడుదుడుకులను ఎదుర్కొని పండించిన పత్తి రైతులకు కనీస ధర అందకపోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి, కో కన్వీనర్ మూడ్ శోభన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం మద్దతు ధర అమలు చేయకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారని తెలిపారు. దీంతో రైతులు తీవ్ర నష్టపోతున్నారని పేర్కొన్నారు. గతేడాది క్వింటాల్ రూ.10వేలు పలికిన పత్తి ధర ఈ ఏడాది రూ.ఆరు వేల నుంచి రూ.6,800లకే కొంటున్నారని పేర్కొన్నారు. ఒకవైపు పత్తి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు, వ్యవసాయ కూలీలకు ధరలు అన్ని పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు అధిక వర్షాలు, చీడ, పీడలు, తెగుళ్లు అన్నింటిని తట్టుకుని పంటలు పండించి మార్కెట్‌కు తీసుకొస్తే గిట్టుబాటు ధర అందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. రైతుకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్ పత్తికి రూ 7,710లు మద్దతు ధర ప్రకటించిందనీ, దాన్ని అమలు చేయని వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

'స్థానికం'లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

- బిసి రిజర్వేషన్లపై న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం
- మెట్రో ఫేజ్-2పై సిఎస్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
- డిసెంబరు ఒకటి నుంచి ప్రజా పాలన విజయోత్సవాలు
- రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పొంగులేటి
- 23నమరోసారి భేటీకి నిర్ణయం



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో 'ఇద్దరు పిల్లల' నిబంధనను ఎత్తివేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బిసి రిజర్వేషన్లపై న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. ఖరీఫ్‌లో పండించిన ప్రతి గింజనూ కొనాలని, సన్నాలకు మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు చేసింది. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మరో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపి బలరాం నాయక్‌తో కలిసి ఆయన మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. 'కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్రంలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్‌లో కోటీ 84 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశాం. ఇందులో 80 లక్షల మెట్రిక్ టన్నులను మిల్లింగ్ చేసి గోదాముల్లో నిల్వ చేస్తాం. అయితే, ఇప్పుడున్న సామర్థ్యం ప్రకారం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం ఉందని కేంద్రం తెలిపింది. అయినా, రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి వర్గం నిర్ణయించింది' అని పొంగులేటి తెలిపారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీం కోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్ చర్చించిందని ఆయన తెలిపారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణుల సలహాలు, సూచనల మేరకు ముందుకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. రెండు రోజుల్లో న్యాయనిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని సిఎస్‌ను మంత్రివర్గం ఆదేశించిందని వివరించారు. మెట్రో రైల్ ఫేజ్-1, ఫేజ్-2 ఎ, ఫేజ్-2 బిపై మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. ఎల్అండ్‌టికి చెల్లించాల్సిన మొత్తం ఫేజ్-2 నిర్మాణానికి కావాల్సిన నిధులు, కేంద్రం విధించిన షరతులు తదితర అంశాలపై చర్చించి నివేదిక సమర్పించేందుకు సిఎస్ నేతృత్వంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి మొదలగు ఉన్నతాధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. డిప్యూటీ సిఎం చైర్మన్‌గా ఉన్న మొబలైజేషన్ కేబినెట్ సబ్‌కమిటీకి అధికారుల కమిటీ నివేదిక అందిన తర్వాత మంత్రివర్గంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆచార్య జయశంకర్ యూనివర్సిటీకి అనుబంధంగా మరో మూడు కొత్త వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో వాటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ ఒకటి నుంచి తొమ్మిది వరకు ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం మంత్రుల కమిటీని నియమించాలని తీర్మానించినట్టు తెలిపారు. రూ.10,547 కోట్లతో నిర్మించే 5,566 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లకు త్వరలో టెండర్లు పిలవాలని నిర్ణయించామని చెప్పారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఒఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్న క్రమంలో ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ కేబినెట్ తీర్మానం చేసిందని తెలిపారు.

కృష్ణా-వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి 2,115.5 ఎకరాల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసిందని పొంగులేటి చెప్పారు. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ తీర్మానించిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలకు కావాల్సిన భూములను కేటాయించాలని నిర్ణయించామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌తో పాటు మరో ఏడెనిమిది విభాగాలకు భూములను అలాట్ చేసినట్టు తెలిపారు. నల్సార్ యూనివర్సిటీకి ఏడు ఎకరాల భూమిని కేటాయించామని, గతంలో స్థానిక విద్యార్థులకు ఉన్న 25 శాతం రిజర్వేషన్లను 50 శాతానికి పెంచామని తెలిపారు.

కొండా సురేఖ గైర్హాజరు

కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ గైర్హాజరయ్యారు. తనకు తెలియకుండానే తన ప్రయివేట్ ఓఎస్టీని ఉద్యోగం నుంచి తొలగించడం, అతన్ని అరెస్ట్ చేసేందుకు తన ఇంటికి పోలీసులు రావడంపై ఆమె ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే, ఆమె రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ కారణంగా మంత్రివర్గానికి హాజరు కాలేకపోయారని అధికార వర్గాలు తెలిపాయి.

నేటినుంచి టీచర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో 317 జిఒ బాధిత ఉపాధ్యాయులు తాత్కాలిక బదిలీ లేదా డిప్యూటేషన్ కోసం శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రెండు లేదా మూడేండ్లపాటు డిప్యూటేషన్‌కు అవకాశం కల్పిస్తూ జీవో నెంబర్ 190ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలిసిందే. ఒఎష్ట్రశీశీశ్రీవసబ్.వశ్రీుఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా శుక్రవారం నుంచి ఈనెల 24 వరకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఆర్జేడీలు, డిఇఒలకు దరఖాస్తు పత్రాలను సమర్పించాలి. వారికి తాత్కాలికంగా బదిలీ లేదా డిప్యూటేషన్‌కు మాత్రమే అవకాశముంటుంది. వారి స్థానిక క్యాడర్‌లో ఎలాంటి మార్పు ఉండబోదు. ఉపాధ్యాయులకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే 8523030307 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

మద్యం దరఖాస్తుల గడువు పెంచలేదు

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ మద్యం పాలసీ 2025లో భాగంగా టెండర్లు పిలిచిన 2,620 మద్యం షాపుల దరఖాస్తు గడువు పెంచలేదని ఎక్సైజ్ కమిషనర్ సి హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల గడువు పెంచుతారని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మ వద్దని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 18తో ఏ 4 మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని తెలిపారు. ఈ నెల 23 రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల సమక్షంలో మద్యం షాపుల డ్రా యధాతథంగా తెలిపారు.

మనిషి మెదడును పురుగులా తొలుస్తున్న మనువాదం

- బిజెపి పాలనలో మహిళలపై పెరుగుతున్న హింస
- తిరోగమన విధానాలను తిప్పికొట్టాలి
- ఐద్వా సెమినార్‌లో మరియం ధావలే



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆధునిక యుగంలో మనం ఎంతో పురోగమిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ- మహిళలపై హింస రకరకాలుగా సాగుతూనే ఉందనీ, స్త్రీల పట్ల వివక్షకు, హింసకు మూలాలు సమాజంలోనే ఉన్నాయనీ, మనిషి బుర్రను పురుగులా తొలుస్తున్న మనువాదాన్ని ఎదిరించకుండా అభివృద్ధి సాధించలేమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే చెప్పారు. ఐద్వా రాష్ట్ర మహాసభ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'మనువాదం-మహిళా హక్కులపై ప్రభావం' అనే అంశంపై ఆ సంఘం ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ అధ్యక్షతన సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మరియం ధావలే మాట్లాడుతూ స్త్రీల పట్ల సాగుతున్న చిన్నచూపు, హింసలో మనువాదం ప్రభావం చాలా ఉందని చెప్పారు. 'స్త్రీ ధర్మాలు' పేరుతో "బాలికైనా, యువతి అయినా, ముసలిది అయినా స్త్రీ స్వతంత్రించి గృహకార్యాలను చేయనీ, బాల్యంలో తండ్రి చెప్పుచేతల్లో, యవ్వనంలో భర్త అదుపాజ్ఞల్లో, భర్త మరణానంతరం కొడుకు ఆధీనంలో ఉండాలి. స్త్రీ ఎన్నడూ తన తండ్రిని, భర్తను, కొడుకులను విడిచి ఉండకూదని ఆంక్షలు విధించారని గుర్తు చేశారు. మనువు శాసనం ప్రకారం భర్తకి తన మీద ఇష్టం ఉన్నా, లేకపోయినా భార్య చిరునవ్వుతో ఉండాలి అని చెప్పటమేంటని ప్రశ్నించారు. మనుధర్మంలో మహిళల పట్ల చూపిన వివక్షకు అంతూపొంతూ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని మంత్రాలు, ఉపోద్ఘాతాలు మహిళల నెత్తి మీద తట్టలకొద్దీ కుమ్మరించాక- ఇక వారికి తమ గురించి తాము ఆలోచించే ధైర్యం ఎక్కడిది? అని ప్రశ్నించారు. 'పెళ్ళాన్ని, తల్లిని, ఆడవాళ్ళని వేధించడం సహజం' అని మగపిల్లలు అనుకుంటుంటే- 'హింసను భరించటం తమ తలరాత' అని ఆడపిల్లలు అనుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేళ్లూనుకుపోయిన వీటన్నింటికీ మనువాద భావాలే కారణమని విమర్శించారు. స్త్రీల శ్రమకు గుర్తింపు లేదని చెప్పారు. ఉన్నా అది నామమాత్రమేననీ, ఈ ధోరణి కూడా హింసకు, వివక్షకూ ఒక కారణమని తెలిపారు. ఆడవాళ్లు ఇంటా బయటా నిరంతరంగా చాకిరీ చేస్తూనే ఉన్నా- ఆ శ్రమకి గుర్తింపు ఉండదా? అని ప్రశ్నించారు. చట్టాలున్నా అవి మనువాద భావజాలకుల నిర్లక్ష్యం వల్ల అమలుకు నోచుకోవటం లేదని చెప్పారు. తమపై హింసను పెంచే, ఈసడింపును కలిగించే భావజాలాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమానత్వాన్ని కోరుతూ చైతన్య పథంలో సాగాలని సూచించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు పెరిగాయని వివరించారు. ఈ దాడుల్లో బాధితుల కంటే నిందితులకే ప్రభుత్వ సహకారం ఉంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలనూ అంబానీ, అదానీలకు కట్టబెడుతోందన్నారు. అన్నింటినీ ప్రయివేటీకరించడం వల్ల రిజర్వేషన్లు అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. తద్వారా ఎక్కువగా నష్టపోతున్నది మహిళలేనని వివరించారు. దీనివల్ల నిరుద్యోగం సైతం పెరుగుతోందనీ, ఆదాయాలు తగ్గి తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తోందని తెలిపారు. దీన్ని అవకాశంగా తీసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రజల నుంచి 24 శాతం నుంచి 200 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయన్నారు. కట్టలేని వారిపై ఒత్తిడి పెంచడంతో వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇందులో అత్యధికం మహిళలే బాధితులుగా ఉన్నారని వివరించారు.

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జ్యోతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల ప్రభావం ప్రతి ఒక్కరిపైనా ఉంటోందన్నారు. ఓటు ఎవరికి వేస్తున్నామో ఆలోచించాలని, ఎన్నికల ముందు కులం, మతం, జాతి పేర్లతో ఓట్లు అడుగుతున్నారన్నారని విమర్శించారు. సన్యాసులు, బాబాలు ఆధ్యాత్మిక చింతన పట్ల, భక్తి విశ్వాసాల పట్ల ఉన్న నమ్మకాలను ఆసరా చేసుకుని వారిపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. డేరాబాబా లాంటి వారికి ప్రభుత్వం అండదండలున్నాయని చెప్పారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ ఉపాధి కల్పనలో మహిళల పట్ల వివక్ష పాటిస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రజలను మతపరంగా విడదీయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నాయని చెప్పారు. మహిళ లేదా ఆడపిల్లపై లైంగిక దాడి జరిగినప్పుడు కులం, మతం కోణం లోంచి చూడడం ఎక్కువైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో చూసి అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, సహాయ కార్యదర్శులు కెఎన్ ఆశాలత, పాలడుగు ప్రభావతి, పి శశికళ, రాష్ట్ర నాయకులు ఎ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.156 కోట్లు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహార పథకం(ఎస్ఎన్‌పీ)కింద సరఫరా చేసిన వస్తువుల బిల్లుల కోసం అవసరమైన నిధులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా వస్తువులు, కూరగాయలు, గ్యాస్ సరఫరాలు, ఇంటి అద్దెల వంటి ఖర్చుల కోసం మొత్తం రూ. 156 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ఖర్చులకు సంబంధించిన అన్ని బిల్లులను వెంటనే సమర్పించాల్సిందిగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ అన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లోపు అన్ని జిల్లాలు తమ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.

సదర్ ఉత్సవానికి సిఎం రేవంత్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 19 హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే సదర్ ఉత్సవానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శ్రీకృష్ణ సదరన్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. గురువారం హైదరాబాద్‌లోని బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎంపి అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సిఎంను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

ఉప ఎన్నికకు నాలుగో రోజు 19 మంది నామినేషన్

- 21 వరకు నామినేషన్ల స్వీకరణ, 22న పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. గురువారం నాలుగోరోజు 19మంది అభ్యర్థులు 21 నామినేషన్లు వేశారు. సోమవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో మొదటి రోజు పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. రెండోరోజు 10మంది అభ్యర్థుల నుంచి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. మూడోరోజు మరో 12మంది 13నామినేషన్లను దాఖలు చేశారు. నలుగోరోజు 19 మంది అభ్యర్థుల నుంచి 21నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకు నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్లకు 21వరకు స్వీకరించనున్నారు. ఆ తర్వాత 22న నామినేషన్లను పరిశీలన చేస్తారు. నామినేషన్లు ఉపసంహరణకు ఈ నెల 24వరకు సమయం ఉండడంతో పెద్దమొత్తంలో నామినేషన్లు వచ్చే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలావుండగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాల కోసం మొత్తం 569 బ్యాలెట్ యూనిట్లు, 569 కంట్రోల్ యూనిట్లు, 610 వివిప్యాట్‌లు కేటాయించారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ నేతృత్వంలో ఈవీఏంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

భారీ భద్రత.. ముమ్మరంగా తనిఖీలు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో పోలీస్ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, మద్యం, నగదును తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఎన్నికల పర్యవేక్షణ ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షలకుపైగా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. గురువారం సైతం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్‌స్క్వాడ్స్ మరో రూ.పది లక్షలు స్వాధీనం చేసుకున్నాయి.

ఫిర్యాదులు, సమాచారం కోసం అందుబాటులోకి హెల్ప్‌లైన్

ఉపఎన్నికల నేపథ్యంలో, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక 1950 హెల్ప్‌లైన్, జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (ఎన్‌జిఆర్ఎస్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నవంబర్ 11న పోలింగ్ జరగనుండడంతో ప్రజలను ప్రలోభాలకు గురిచేసిన, ఇతర సమస్యలు తలెత్తినా 1950 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చును.



మీసేవా ఉద్యోగులకు ఇన్సెంటివ్ ఇవ్వండి

- మీసేవా ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీసేవా ఉద్యోగులకు ఇన్సెంటీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ మీసేవా ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె వెంకటేష్, అధ్యక్షులు ఆర్ సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని మీసేవా ఇఎస్‌డి కమిషనర్ రవికిరణ్‌కు ఆ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతిఏటా దీపావళి సందర్భంగా మీసేవా ఉద్యోగులకు ఇచ్చే స్వీట్ బాక్సులను ఈసారీ ఇవ్వాలని కోరారు.

ఓఆర్ఆర్‌పై టైరు పేలి అదుపుతప్పిన ప్రయివేట్ బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఒఆర్ఆర్‌పై టైరు పేలి ఓ ప్రయివేట్ బస్సు అదుపుతప్పి బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్‌కు చెందిన ఓ ప్రయివేట్ బస్సు గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు గురువారం ఉదయం వేగంగా వెళ్తోంది. రాజేంద్రనగర్ అవుటర్ రింగ్ రోడ్డు వద్ద బస్సు టైరు పేలి పూర్తిగా అదుపు తప్పి శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం, బొలెరో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న 30 మందిలో తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే తోటి ప్రయాణికులు 108లో వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న బస్సును, బొలెరో వాహనాన్ని క్రేన్ సాయంతో పక్కకు తీశారు. ప్రమాదంతో ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్‌ని పునరుద్ధరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

18న రాష్ట్ర బంద్‌లో విద్యార్థులు పాల్గొనాలి : పిఎస్‌యు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18న బిసి జెఎసి తలపెట్టిన బంద్‌లో విద్యార్థులు పాల్గొన్నాలని పిఎస్‌యు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసిలకు తీరని అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలను అన్ని రకాలుగా అణచివేతకు గురిచేస్తున్నదని తెలిపారు. బిసి రిజర్వేషన్లను అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం మోసం చేస్తోందని పేర్కొన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్రం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేసి బిసి రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్‌లో చేరిస్తేనే బిసి రిజర్వేషన్లకు శాశ్వత న్యాయరక్షణ లభిస్తుందని తెలిపారు.

హైదరాబాద్‌లో స్టైట్ బ్యాట్ ప్రో ఆవిష్కరణ

హైదరాబాద్ : భారతీయ స్పోర్ట్స్ టెక్ కంపెనీ స్టైట్ బ్యాట్ హైదరాబాద్‌లో తమ ఎఐ ఆధారిత 'స్టైట్ బ్యాట్ ప్రో' ఉత్పత్తిని ఆవిష్కరించింది. ఇది ప్రపంచంలో మొదటి రకం నెక్స్ట్-జెన్ స్మార్ట్ టెక్నాలజీగా గుర్తింపు పొందిందని.. ఇది ఆకారం లేదా బరువు మార్చకుండా, బ్యాట్ స్పీడ్, స్వింగ్ యాంగిల్, షాట్ ఇంపాక్ట్ వంటి డేటాను రియల్ టైమ్‌లో చూపుతుందని స్టైట్ బ్యాట్ సహ వ్యవస్థాపకుడు మధుసూదన్ తెలిపారు. ప్రతి ఆటగాడికీ ప్రపంచస్థాయి విశ్లేషణను అందించడం తమ లక్ష్యమని, స్టైట్ బ్యాట్ ప్రో ఆవిష్కరణతో అది సాధ్యమైందన్నారు. తమ వ్యాపారాన్ని పది దేశాలకు విస్తరించామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుల ఆత్మహత్యాయత్నం

- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు స్నేహితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగుమాడుకు చెందిన ఆముదాల రాము, షేక్ జానీ ఇద్దరు స్నేహితులు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బుధవారం రాత్రి మద్యం సేవించి ఈ క్రమంలో పురుగుల మందూ తాగారు. గ్రామంలో రోడ్డుపై పడి ఉండగా స్థానికులు గుర్తించి స్థానిక ఆస్పత్రికి తరలించారు. రాము పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. జానీకి మధిర సివిల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, పోలీస్ స్టేషన్‌కు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.

బిసి రిజర్వేషన్లపై బిజెపి నాటకం

- కేంద్రంపై పోరాడితేనే 18న రాష్ట్ర బంద్‌కు మద్దతు
- లేదంటే స్వతంత్రంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- అఖిలపక్షం నిర్వహించి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలి
- నేడు చలో రాజ్‌భవన్ : జాన్‌వెస్లీ పిలుపు
- బిజెపితో వేదిక పంచుకోం : తమ్మినేని



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాటకమాడుతున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఒకవైపు కేంద్రంలో బిసి రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో ఈనెల 18న బిసి జెఎసి రాష్ట్ర బంద్‌కు బిజెపి మద్దతు ఇచ్చిందని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే ఈనెల 18న బిసి జెఎసి తలపెట్టిన రాష్ట్రబంద్‌లో పాల్గొంటామనీ, లేదంటే స్వతంత్రంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో బిసి సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు భాగస్వాములు కావాలని కోరారు. బిసి రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందన్నారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని వివరించారు. ఆర్నెల్లైనా ఆమోదించలేదని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే దాన్ని కూడా కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లకు సంబంధించి జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసిందన్నారు. ఆ జీవోపై హైకోర్టు స్టే విధించిందని చెప్పారు. ఆ స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే ఆ పిటిషన్‌ను తిరస్కరించిందని వివరించారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించుకోవాలంటూ సూచించిందని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈ నెల 18న బిసి జెఎసి రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిందనీ, అన్ని రాజకీయ పార్టీల మద్దతునూ కోరిందని చెప్పారు. ఈ బంద్‌కు బిజెపి కూడా మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉందని, బిసి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఆ పార్టీపైనే ఉందని అన్నారు. కాంగ్రెస్ కూడా బంద్‌కు మద్దతు ఇచ్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్రబంద్ ఎవరికి వ్యతిరేకంగా జరుగుతున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిజెపికి ఎనిమిది మంది ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలున్నారని వివరించారు. బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని బిజెపి ప్రజాప్రతినిధులు అడుగుతారా?అని ప్రశ్నించారు. బిసి జెఎసి నేతలు ఆలోచించాలనీ, కేంద్రం తీరుకు వ్యతిరేకంగా బంద్ నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించాలని, కేంద్రంపై పోరాడాలని సూచించారు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంలో సిపిఎం మద్దతునిస్తుందని చెప్పారు. బంద్‌కు బిజెపి మద్దతు ఇవ్వడంతో ప్రజలకు సరైన దిశ ఉండబోదని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 18న బిజెపికి వ్యతిరేకంగా బంద్ చేపడితే పాల్గొంటామనీ, లేదంటే అదేరోజు సిపిఎం ఆధ్వర్యంలో మండలాలు, పట్టణాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, బైక్ యాత్రలు నిర్వహిస్తామనీ, కేంద్రం తీరును నిరసిస్తామని అన్నారు. ఇందులో బిసి సంఘాలు, అభ్యుదయ సంఘాలు, ప్రజాతంత్రవాదులు పాల్గొనాలని కోరారు.

బిసి రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం బిజెపి : తమ్మినేని

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకునే రాజకీయ పార్టీని అందరూ గుర్తించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఈ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని విమర్శించారు. ఆ పార్టీకి, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 18న బిసి జెఎసి తలపెట్టిన రాష్ట్ర బంద్ జరగాలన్నారు. బిజెపి ఉన్న వేదికల్లో తాము పాల్గొనేది లేదని స్పష్టం చేశారు. తాము స్వతంత్రంగా ఉద్యమాలను చేపడతామని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అఖిలపక్షం సహకారంతో ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోగి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఎస్ ఇంటర్నేషనల్‌కు విదేశాంగ శాఖ కాంట్రాక్టులు

న్యూఢిల్లీ : చైనాలో భారతీయ వీసా దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేయటానికి, నిర్వహించడానికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నుండి ప్రతిష్టాత్మకమైన మూడు సంవత్సరాల కాంట్రాక్టులను అందుకున్నట్లు బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ తెలిపింది. ప్రభుత్వాలు, దౌత్య కార్యకలాపాలకు విశ్వసనీయమైన ప్రపంచ సాంకేతిక ఆధారిత సేవల భాగస్వామి గుర్తింపు ఉందని పేర్కొంది. ఈ ప్రతిష్టాత్మక ఒప్పందం అక్టోబర్ 14 నుండి అమలులోకి రావటంతో పాటుగా రాబోయే మూడు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని వెల్లడించింది.

ఆరోగ్యకరమైన ఆహారం అవసరం

హైదరాబాద్ : ఆరోగ్యకరమైన ఆహారము చాలా అవసరమని తెలంగాణ ప్రభుత్వ మాజీ కార్యదర్శి రాజా సదరం అన్నారు. ఆహారం అనేది నిత్య జీవితంలో ఒక భాగం అని.. ఆహారం పై పిల్లలకు అవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని కలినారి అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ చెఫ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజా సదరం, కలినారి ఆఫ్ ఇండియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అక్షయ కులకర్ణి, కలినారి అకాడమీ ఆఫ్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ...ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించడంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఇన్‌స్టామార్ట్‌లోనూ పసిడి, వెండి విక్రయాలు

బెంగళూరు : దేశ వ్యాప్తంగా ఐదు రోజుల పాటు జరిగే దీపావళి పండుగ, ధంతేరాస్ పురస్కరించుకుని ఇన్‌స్టామార్ట్ కీలకమైన మెట్రో నగరాలలో విస్తృత శ్రేణి బంగారం, వెండి నాణేలతో పాటు 1 కిలో వెండి ఇటుకలను సైతం వినియోగదారులకు అందించటానికి సిద్ధమయినట్లు పేర్కొంది. పలు అభరణాల రిటైల్ చెయిన్ సంస్థలతో కలిసి సర్టిఫైడ్ బంగారం, వెండి నాణేలను అందిస్తున్నట్లు పేర్కొంది. వినియోగదారులు 0.1 గ్రా నుండి 10 గ్రా వరకు బరువున్న బంగారాన్ని ఆర్డర్ చేయవచ్చని వెల్లడించింది. ధంతేరాస్ నాడు ఒక గ్రాము లేదా అంతకంటే ఎక్కువ బంగారు నాణేలను కొనుగోలు చేసే మొదటి 10,000 మంది కస్టమర్‌లకు రూ.100 తగ్గింపు లభిస్తుంది. ఈ ఆఫర్ అక్టోబర్ 18 ఉదయం 7 గంటలకు వరకుఅందుబాటులో ఉంటుందని పేర్కొంది.



మెడికల్ కాలేజీ, సమీకృత గురుకులాలు తరలించొద్దు..

- స్వచ్ఛందంగా కొడంగల్ బంద్
- బంద్ పాటించిన వ్యాపారస్తులు, విద్యాసంస్థలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ డెవలప్‌మెంట్ కమిటీ (కెడిసి) జెఎసి ఆధ్వర్యంలో తలపెట్టిన కొడంగల్ బంద్ గురువారం విజయవంతమైంది. వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, ఇతర వాణిజ్య, వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా కెడిసి జెఎసి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేసీ కన్వీనర్ లక్ష్మీనారాయణ గుప్తా, కో-కన్వీనర్లు గంటి సురేష్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేష్‌బాబు, సలహాదారులు దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌యాదవ్ మాట్లాడారు. కొడంగల్ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి.. ఇక్కడ ఏర్పాటు చేస్తామన్న మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇప్పుడు ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో ఈ ప్రాంతం పట్ల సీఎం చిత్తశుద్ధి అర్థమవుతుందని ఆరోపించారు. కొడంగల్ ప్రాంతం ఏళ్లుగా వెనుకబాటుకు గురైందన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎంతో ఆశ పడ్డామని చెప్పారు. కానీ కొడంగల్ ప్రజల ఆశలను వమ్ము చేశారన్నారు. ఇక్కడికి మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలతో పాటు అనేక పరిశ్రమలు తీసుకొచ్చి అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని తెలిపారు. మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపును వ్యతిరేకిస్తూ వారం రోజులుగా ఉద్యమాన్ని కొనసాగిస్తుంటే.. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన చేయకపోవడం చూస్తుంటే ఈ ప్రాంత ప్రజల మనోభావాలు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుస చంద్రయ్య, నవాజ్, రమేష్‌బాబు, వెంకట్‌రామ్‌రెడ్డి, మాసాని వెంకటయ్య, అనిల్, నందరం రాజేందర్, ప్రవీణ్, పవన్, శాంత్‌కుమార్, భీమ్ రాజు, రవీందర్‌నాయక్, మురళీధర్‌రెడ్డి, నజర్, సూర్యనాయక్, ఓం భాను తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం విద్యార్థుల ఆందోళన

- ప్లేట్లు పట్టుకుని రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాఠశాలలో తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆందోళన చేశారు. గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ప్లేట్లు పట్టుకుని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలలో తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణం ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.

ట్యాంకును శుభ్రం చేశాం...

ఉదయం ట్యాంకులు శుభ్రం చేయడం వల్ల నీళ్లు అయిపోయాయి. రాగి జావ తాగాక పిల్లలు గ్లాసులు కడుక్కోవడానికి నీళ్లు సరిపోక కొందరు మాత్రం ఇళ్ల దగ్గరకు వెళ్లారు. మిషన్ భగీరథ నీళ్లు కొద్దిగా ఆలస్యంగా రావడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు

బంద్‌లో పాల్గొంటాం

- పార్టీలపరంగా రిజర్వేషన్లతో ఎన్నికలు ఒప్పుకోం
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బిసి జెఎసి ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌లో పాల్గొంటామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ బంద్‌లో పాల్గొనేందుకు తెలంగాణ భవన్ నుంచే తరలి వెళతామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. క్యాబినెట్‌లో పార్టీలపరంగా రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయిస్తే ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. కులగణన సరిగ్గా చేయలేదనీ, సర్వే పత్రంపై సిఎం, డిప్యూటీ సిఎం ఫోటోలు పెట్టడం, గవర్నర్‌కు అసెంబ్లీ తీర్మానం వెళ్లకముందే ఢిల్లీలో ధర్నా, ఆ ధర్నాకు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లాంటి కాంగ్రెస్ జాతీయ నేతలు హాజరు కాకుండా కాంగ్రెస్ డ్రామాలు చేసిందని విమర్శించారు. చట్టపరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఆయన హెచ్చరించారు. బంద్‌లో ప్రతి బిసి పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ వెంటపడతామని హెచ్చరించారు. చట్టం లేకుండా ఏ జడ్జి అయినా తీర్పు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. 18న బంద్‌కు అందరు సహకరించాలని కోరారు.

రాష్ట్రానికి చేరుకోనున్న 12 మంది గల్ఫ్ కార్మికులు

- మాట నిలుపుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది గల్ఫ్ కార్మికులు వారం రోజుల్లో రాష్ట్రానికి రానున్నారు. అధికారంలో లేకపోయినా మాజీ మంత్రి హరీశ్ రావు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. ఆ కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ బాసటగా నిలిచారు. కెసిఆర్ ఆదేశాలతో అక్కడ చిక్కుకున్న వారిని స్వదేశానికి రప్పించేందుకు హరీశ్ రావు అన్ని ప్రయత్నాలు చేశారు. బిఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్, ఎంపి సురేష్ రెడ్డి సమన్వయంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి కార్మికులను పంపించేందుకు ఒప్పించారు. కంపెనీకి చెల్లించాల్సిన మొత్తాన్ని స్వయంగా భరిస్తూ, విమాన టికెట్లు సైతం ఏర్పాటు చేశారు. విషయం తెలియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న జోర్డాన్ లో ఉన్న తెలంగాణ గల్ఫ్ కార్మికులు. తమ వారు తిరిగి స్వదేశానికి వస్తుండటంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

గల్ఫ్ కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా మీడియా దృష్టికి హరీశ్ రావు తీసుకువెళ్లారు. జోర్డాన్‌లోని కంపెనీకి పెనాల్టీ చెల్లించేందుకు హరీశ్ రావు అంగీకరించారు. దీంతో వారి రాకకు మార్గం సుగమమయింది. మరో వారంలో నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, సిద్ధిపేటలకు చిందిన 12 మంది గల్ఫ్ కార్మికులు తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. సుదీర్ఘ కాలపు ఎదురుచూపుల తర్వాత వారి కుటుంబాలను కలుసుకోబోతున్నారు.

గల్ఫ్ కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్

రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసినట్టుగానే గల్ఫ్ కార్మికులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కెసిఆర్ పాలనలో వలసలు వాపస్ అయితే రేవంత్ పాలనలో మళ్లీ వలసలు మొదలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభయహస్తం మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల సంక్షేమ బోర్డు అతీగతీ లేదన్నారు. కనీసం టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారి సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. చిక్కుకున్న కార్మికులు తిరిగి రాష్ట్రానికి వస్తుండటం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

- కువైట్ నుంచి హైదరాబాద్ మీదుగా షార్జాకు వెళ్తుండగా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కువైట్ నుంచి హైదరాబాద్ మీదుగా షార్జాకు వెళ్తున్న ప్రయాణికుల నుంచి 1.798 కిలోల బంగారాన్ని డిఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగారం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిఘా కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో కువైట్ నుంచి హైదరాబాద్ మీదుగా ఎయిర్ అరేబియా ఫ్లైట్ జీ9467 విమానంలో షార్జాకు ప్రయాణికులు వెళ్తున్నారు. అధికారులు ప్యాసింజర్ లగేజీని చెకింగ్ బ్యాగేజ్‌లో భాగంగా తనిఖీలు చేశారు. అధికారులు సన్‌ఫ్లవర్ బ్యాగ్ లోపల దాచుకొని తీసుకెళుండగా పట్టుకున్నారు. అందులో 24 క్యారెట్ల బంగారం కడ్డీలు ఐదు, మరో బ్యాగేజీలో రెండు 24 క్యారెట్ల బంగారు కడ్డీలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు పరిశీలించి తూకం వేశారు. వాటి బరువు 1798 గ్రాములుగా లెక్కించారు. దీని విలువ రూ.2.37 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. బంగారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు నిందితులను అరెస్టు చేశారు. కస్టమ్స్ చట్టం 1962 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీని కదిలించాలి

- రాజ్యాంగ సవరణ మాత్రమే బిసిలకు శ్రీరామరక్ష
- బిసి జెఎసి చైర్మన్ ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీకి తాకాలని బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సీనియర్ జర్నలిస్టు రమణకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బిసి జర్నలిస్టుల అసోసియేషన్ సమావేశానికి బిసి జెఎసి నేతలతో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఈ పోరాటం ఆగదని, బిసిలంతా ఏకమై రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బంద్ ముగింపు కాదని.. ఆరంభం మాత్రమేనని వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించడం బిసిల పట్ల వ్యవస్థలు వ్యతిరేకంగా ఉన్నాయనడానికి నిదర్శనమని వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వకపోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బిసి జెఎసి కోచైర్మన్ డి.రాజారాం యాదవ్ అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల పట్ల సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. సమగ్ర కులగణన మొదలుకొని.. బిల్లును రాష్ట్రపతికి పంపడం, అది పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తేవడం, ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉండగానే జిఒ 9ని తీసుకురావడం వరకు రేవంత్ రెడ్డి చేసిన తప్పిదాల వల్లే కోర్టులు బిసి రిజర్వేషన్ల పిటిషన్లను కొట్టేసే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగంలో రక్షణ కల్పించినట్టుగానే.. రాజ్యాంగ సవరణ ద్వారా బిసిల రిజర్వేషన్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టు.. రిజర్వేషన్ల అమలును రాష్ట్రాలకే అప్పగించాలని, అప్పుడే బిసిలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు మేకల కృష్ణ, కొత్త లక్ష్మణ్ పటేల్, నీలకంఠం ముదిరాజ్, బొమ్మ అమరేందర్, వివిధ కుల సంఘాలు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేరుకు దిగ్గజ కంపెనీ.. చేసేవన్నీ చట్టవిరుద్ధ పనులు

- మొన్న కాలుష్యజలాలు విడుదల.. నేడు కెమికల్ డ్రమ్ముల అక్రమ నిల్వ
- ఫంక్షన్ హాల్‌పై దాడి చేసిన నార్కోటిక్ అధికారులు
- కన్నెత్తిచూడని పిసిబి, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు
- కాలుష్య జలాలకు మృత్యువాత పడుతున్న మూగజీవాలు



నల్లకుంట చెరువులో కలుస్తున్న వ్యర్థాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేరుకు దిగ్గజ కంపెనీ.. పేరుప్రతిష్టలకు డోకాలేదు.. కానీ చేసే పనులన్నీ చట్టవిరుద్ధమైనవే.. ఆ కంపెనీ ఏదో కాదు.. హెటిరో ఫార్మా పరిశ్రమ.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం గడ్డపోతారంలోని ఈ కంపెనీ.. వరుస వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. పరిశ్రమ నుంచి వ్యర్థాలను దోమడుగు నల్లకుంట చెరువులోకి విడుదల చేయడంతో నీరు కలుషితమైందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించి మమ అనిపించారు. భూగర్భజలాలు సైతం కలుషితం కావడంతో స్థానికులు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారు. చర్మవ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు నరకం అనుభవిస్తున్నా పిసిబి, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మాత్రం హెటిరో జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆ కంపెనీ ఆడిటింగ్ నుంచి తప్పించుకునేందుకు కెమికల్ డ్రమ్ములను అక్రమంగా నిల్వ చేసిన వాటిపై నార్కోటిక్ అధికారులు దాడిచేశారు.

అక్రమంగా కెమికల్ డ్రమ్ముల నిల్వ..

ఫంక్షన్ హాలులో కెమికల్ డ్రమ్ములను అక్రమంగా నిల్వ చేస్తున్నా.. హెటిరో తమకున్న రాజకీయ పలుకుబడితో అధికార యంత్రాంగాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ నిజాలు బయటకు రాకుండా చూస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థ జలాలు, కెమికల్ వ్యర్థాలను శుద్ధి చేయడానికి కర్మాగారానికి తరలించాల్సి ఉండగా ప్రమాదకరమైన కెమికల్స్‌ను అక్రమంగా నిల్వ ఉంచి రాత్రివేళ కాల్వలు, పొలాల్లోకి డంప్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తమకున్న పరిమితికి మించి ప్రొడక్షన్ చేయడం ఒక కారణమైతే, శుద్ధి కర్మాగారానికి తరలిస్తే ఖర్చు ఎక్కువ రావడంతోపాటు తమ బండారం బయటపడుతుందని ఆక్రమంగా వ్యర్థాలను నిల్వచేసి గుట్టుచప్పుడు కాకుండా ఖాళీ ప్రదేశాల్లో వదులుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ రసాయన డ్రమ్ములను నిల్వ ఉంచిన ఫంక్షన్ హాలుకు రూ.లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నట్టు తేలింది.

ఆడిటింగ్ కోసమే అక్రమ నిల్వ..
దాడిచేసిన నార్కోటిక్ అధికారులు..

పారిశ్రామిక వాడలో చాలా రసాయన పరిశ్రమలు తమ అనుమతికి మించి ప్రొడక్షన్ చేయడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా ఇతర రకాల కెమికల్స్‌ను తయారు చేస్తున్నాయనే సమాచారంతో నార్కోటిక్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ వ్యవహారానికి స్థానిక అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారని, ఆడిటింగ్ సమయాల్లో మాత్రం స్టాక్స్‌ను గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలిస్తారని తెలుస్తున్నది. హెటిరోలో ఆడిటింగ్ జరగాల్సి ఉందని అందుకోసమే అక్రమంగా తయారు చేస్తున్న కెమికల్స్‌ను బయట ప్రదేశంలో నిల్వచేశారని చేసినట్టు సమాచారం.

మూగజీవాల మృత్యుఘోష..

సంగారెడ్డి జిల్లా దోమడుగు గ్రామంలో మూగజీవాల మృత్యుఘోష వినిపిస్తోంది. రసాయన వ్యర్థ జలాల కారణంగా పాడి పోషణ చేస్తూ బతికే రైతు కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతోంది.

చింతల శ్రీధర్‌కు నల్లకుంట చెరువు పై భాగంలో పశువుల కొట్టం ఉంది. కొన్నేండ్లుగా పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు 18 బర్రెలు ఉండగా అందులో ఇప్పటికే 8 చనిపోయాయి. కాలుష్య జలాలే ఇందుకు కారణమని తెలిపారు.

ప్రతి సంవత్సరం 10 దూడలు జన్మిస్తాయని, ఇందులో ఒక్కటి బతికితే అదే గొప్ప అన్నట్టుగా పరిస్థితి మారిందని అన్నారు. చెరువు నీళ్లతోపాటు భూగర్భజలాలు పూర్తిగా కలుషితమవడంతోనే జీవాలు చనిపోతున్నాయని, ఎంతమందికి ఫిర్యాదు చేసినా పట్టించునేవారే కరువయ్యారని శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో పాటు మూగజీవాల ప్రాణాలు తీస్తున్న హెటీరో పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన దూడల తోలుతో మరుగేదెల రూపంలో తయారు చేసిన బొమ్మల ను పెట్టి పాలు పిండుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.